# సావాసఫలితం

రచన:
గొంగాళ సూర్యభగవాన్లు

ఆ వేళ ఆదివారం. తీరికగా మాధవరావు తనమిత్రుడు ప్రసాద్ రూమ్‌కు బయలుదేరాడు కాస్సేపు పిచ్చాపాటికి. తలుపులు తెఱచివుండటంమూలాన్న నెమ్మదిగా అడుగులువేసుకుంటూ లోనికిపోయాడు. ప్రసాద్ గదిలో టేబిల్ వద్దనున్న కుర్చీలో కూచుని దేన్నిగురించో తీవ్రంగా ఆలోచించడంలో నిమగ్నుడైవుండటంమూలాన్ని మిత్రునిరాకనే గమనించలేకపోయాడు.

"ఏరా బ్రదర్!"అంటూ మాధవ్ భుజంమీద చెయ్యివేసి తట్టేప్పటికి ప్రసాద్ ఒక్కమారుగా త్రుళ్లిపడి "ఓ నువ్వా! ఎంతసేపయింది వచ్చి అట్లా కూర్చో" అన్నాడు ప్రసాద్ తడబడ్తూ.

"వాళకం అట్లావుందేం యివాళ! దేన్ని గురించో అఖండంగా ఆలోచిస్తున్నావ్!" అన్నాడు ఎగతాళిగా మాధవ్.

"అబ్బే ఏంలేదు" అన్నాడు మళ్ళా కంగారుగా ప్రసాద్.

"నాదగ్గఱ బొంకటం దేనికి బ్రదర్! నీ జిడ్డుముఖం, చింపిరిజుట్టూ అన్నీ చూస్తుంటే అచ్చంగా ప్రేయసిని పోగొట్టుకున్న ప్రియుడులా వున్నావ్."

"సరిగా కనిపెట్టావు మాధవ్! మనఃపూర్వకంగా ప్రేమించిన ప్రేయసి వియోగపర్యవసానమే నా యీ ప్రస్తుత బ్రహ్మచర్యం. ఐదేండ్లక్రితం చనిపోయిన నాప్రేయసి ఇవాళ అప్రయత్నంగా జ్ఞాపకం రావటంవల్ల నా గడచిన జీవితాన్నంతా నెమరువేసుకుంటూ కూర్చున్నా."

"చాలా ఆశ్చర్యంగా ఉన్నదే! ఈ విషయాన్ని యిదివరకెన్నడూ నాకు చెప్పినట్లు లేదే" అన్నాడు మాధవ్ ఆశ్చర్యంగా.

"నే నెన్నడూ ఆ విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోవటానికి యత్నించక పోవడంవలన నీకావిషయాన్ని చెప్పలేకపోయాను మాధవ్. కాని యివాళ యాదాలాపంగా సామాన్లు సర్దుతూంటే ఆమెఫోటో దొరికింది. దానితో పూర్వగాథంతా ఒక్కమారుగా దర్పణంలో ప్రతిఫలించినట్లయింది" అంటూ ఆ ఫోటోను మాధవ్ కిచ్చేడు.

మాధవ్ ఫోటోను తిలకించి, "ఇంత అందమైన యువతిని పోగొట్టుకోవడం కేవలం నీదురదృష్టంరా ప్రసాద్" అన్నాడు మాధవ్ సానుభూతిగా.

"కాని ఆమె చనిపోవటానికి కారణం నా దురదృష్టంకాదు మాధవ్ ఆమె సావాస ఫలితం అది."

"నీమాటలు నాకు సరిగా అర్థంకావడం లేదు."

"అయితే విను. నా దుఃఖభారమన్నా కొంత ఉపశమిస్తుంది" అంటూ తన గాథ సంతతినీ చెప్పడం మొదలెట్టేడు.

చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించటంమూలాన్న నా మేనమామ ప్రకాష్ పంచను చేరుకోవాల్సొచ్చింది. మామయ్య అభిమానంగా ఆదరించి అండజేర్చుకున్నాడు. అత్తయ్యకూడా నాపట్ల సానురాగంచూపుతు తన ఏకైక పుత్రిక సునీతతో సమానంగా చూచుకునేది. నా తల్లిదండ్రులు నా పేరిట కొంత స్థిరాస్తివిడిచి గతించటంవల్ల నన్ను పోషించడంలో మామయ్యకు ఆర్థికంగా ఏమీ యిబ్బంది కల్గలేదు.

మామయ్య ఆ ఊళ్ళో పేరుమోసిన డాక్టర్. పెద్ద బంగళా, ఇంటినిండా నౌఖర్లూ, స్వంత కారు, ఎంతో దర్జాగా ఉండేది. చిన్నతనంలోనే మా యిరువురి హృదయాల్లోనూ ఏదో అర్థంతెలియని అనురాగం ఉదయించింది ఒకరిపై ఒకరికి. ఒక్కనిముషమైనా నన్ను విడిచివుండేదికాదు సునీత. మామయ్యయింటికివచ్చిన పరిచితులకు మమ్మల్నిచూపి, "వీరిరువురూ కాబోయే దంపతులు. ఎట్లాగుందీ జంట!" అనేవాడు తన సెలక్షనుకు తిరుగులేదన్నట్లు గర్వంగా.

"ఓ, చాలాబాగుంది. ఇప్పుడే యింత అన్యోన్యంగావున్న వీరు యిహ పెరిగి పెద్దవాళ్లై పెళ్ళిచేసుకున్నపిదప మరి వేరే అడగాలా?" అనేవారు ఎగతాళికి. దాంతో సునీత మూతిముడిచి లోపలికి పరుగుతీసేది. ఆమెవెనుకే నేనూనూ.

సంవత్సరాలు దొర్లినై. నేనూ సునీత పెద్దవాళ్ళమయాం. నేను ఇంటరు, సునీత స్కూలు ఫైనలు చదువుతున్నాం.

ఆ వేళ సాయంకాలం కాలేజీనుండి త్వరగా రావడంవల్ల తీరిగ్గా నాగదిలో కూచుని మేగజైను పేజీలు తిరగవేస్తున్నా. ఇంతట్లో ప్రక్కగదిలో మామయ్య, అత్తయ్య ఏదో నాగురించి మాట్లాడుతూండడంవల్ల కాస్త శ్రద్ధగావినడం మొదలుపెట్టేను.

"ఏమైనా చెప్పండి. ఈసంవత్సరం పిల్ల పెండ్లివిధిగా జరగాల్సిందే" అంది అత్తయ్య.

"నీకు అస్తమానం పెండ్లితప్పితే వేరే ప్రసంగమే లేదుగా! పిల్లకి పాతికేళ్ళొచ్చాయనా లేక ముప్పైఏళ్ళు వచ్చేయనా పెళ్లికి అంత తొందరపడ్తున్నావ్. ఇంతకూ పెండ్లికొడుకుకోసరం చెప్పులరిగేట్టు తిరిగే బాధ మనకు లేదుగా! ఏదో హాయిగా చదువుకుంటున్నారు. చదువుకోనీ. అతడికి బి.ఏ. పరీక్ష పూర్తవగానే పెళ్ళి చేద్దాం" అన్నాడు మామయ్య.

"బావుందండీ! ఎవరైనావింటే నవ్విపోతారు. ఇంకా యీసంవత్సరంకాక రెండేళ్లు అవుతేనేగాని అతడి బి. ఏ. పూర్తవదు. ఇవతల పిల్లచూస్తే రజస్వలయి ఏడ్నర్థం పొద్దు కావస్తోంది. నలుగురూ 'అల్లుణ్ణి ఇంట బెట్టుకునే పెళ్ళిచేయవేమమ్మా?' అని వేపుకతింటున్నారు. (గొంతు తగ్గించి) చిన్నప్పుడు వాళ్ళు స్వేచ్ఛగా తిరిగితే బాధలేకపోయేది. కాని యిప్పుడు లోకులు ఎవరికితోచిన విధంగా వాళ్ళను అంటారు. ఇహ కాలం ఖర్మం కూడి ఎటుండి ఏదివచ్చినా......"

అని అత్తయ్య ఏదో అనబోతూండగా మామయ్య అడ్డంవచ్చి "బాల్లే ఊరుకో! అతను అందరి కాలేజీకుర్రాళ్ళకుమల్లే అల్లరి చిల్లరి రకంకాదు. చాలా బుద్ధిమంతుడు" అన్నాడు.

"ఓ! మా నాన్నగారుకూడా మీగురించి అట్లానే చెప్పేవారు. జ్ఞాపకం తెచ్చుకోండి. మనకు కార్యంకాకముందు పెద్దపండక్కివచ్చి మీకేంచేసారో?" అంది ముసిముసినవ్వులు నవ్వుతూ అత్తయ్య.

"ఇహ అట్టే నా ప్రాణాలు కొరుక్కు తినకు! అమ్మాయి వచ్చిన తర్వాత దాన్ని కనుక్కుని, దానికెట్లా యిష్టమైతే అట్లా చేద్దాం. ఇంతకూ దాని అభిప్రాయం కనుక్కోకుండా మనం పోట్లాడుకోవటందేనికి?" అని అంటూండగా అత్తయ్య "అదిగో! అమ్మాయికూడా మాటల్లోనే వచ్చింది. బంగారుతల్లికి వెయ్యేళ్ళాయిష్షు" అంది.

"ఏమిటమ్మోయ్! ఒక్కమారుగా అంతలా దీవించేస్తున్నావ్" అంది చిలిపిగా సునీత.

"అబ్బే! మరేంలేదే. ఏదో మేము నీ పెండ్లి విషయమై ప్రస్తావించుకుంటున్నాం— నువ్వూ సమయానికే వచ్చావ్."

"ఇదిగో అమ్మాయ్! ఈయేడు నీ పెళ్ళి చేసెయ్యమని మీఅమ్మ నన్ను వేపుకతింటోంది. ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అన్నాడు.

"పెళ్ళికేం తొందర నాన్నా! ఇంకా పైచదువు చదువుకోవాలని ఉత్సాహంగా ఉంది" అంది సునీత కొంచెం సిగ్గుగా.

"విన్నావా అమ్మాయ్ యేమంటోందో? దానికిలేని తొందర మనకెందుకు? ఉన్నది ఒక్కపిల్ల! దాని ముద్దూ మురిపెం తీర్చటం మన విధి!"

"ముద్దూ మురిపెం ఎవరు తీర్చుకోవద్దన్నారు? పెళ్ళిచేసుకుంటే చదువుకోకూడదా యేం?" అంది అత్తయ్య కోపంగా.

"'వివాహం విద్యానాశనం' అన్నారు. అందుచేత దానికి పైకి చదువుకోవాలనివున్నప్పుడు వివాహం చెయ్యకపోవటమే మంచిది. దాన్నిమాత్రం నువ్వు అనవసరంగా బలవంతం చెయ్యమాకు."

"మీరెప్పుడైనా నామాట విన్నారు కనుకనా ఇప్పుడుమాత్రం వినడానికి. మీకూతురు అది! దానిసంగతి వేరేచెప్పాలా? మీయిష్టం వచ్చినట్లు చేసుకోండి. ఇందులో నేనేమీ జోక్యం చేసుకోను" అంటూ కోపంతో విసురుగా లోపలికి వెళ్ళింది.

"చూడునాన్నా అమ్మకి ఎంత కోపం వచ్చిందో" అంది ముద్దుగా సునీత.

"పోనిస్తూ మీఅమ్మ పట్టి పురాతన రకం మనిషి."

సునీత తనతండ్రి కోటుబొత్తాములు సవరిస్తూ 'నాన్నా!' అంది కొంచెం అస్పష్టంగా.

"ఏం తల్లీ!" అన్నాడు మామయ్య వాత్సల్యంగా ఆమెతల నిమురుతూ.

"అబ్బే! మరేంలేదు నాన్నా. కాలేజీ దగ్గరనే ఎవరో కృపాకర్ అనే అతను ఒక నర్తనశాల ప్రారంభం చేసేడట. అందులో నృత్యం నవీనపద్ధతులలో ఎంతో చక్కగా నేర్పుతున్నారట నాన్నా! మా క్లాసు మేట్సంతా చేరేరు. నేనుకూడా......" అని ఆమె యింకా ఏమో అనబోతూండగా, "సరే! దానికేం? అట్లానే ప్రవేశించు—నీ అభీష్టాని కెన్నడైనా అడ్డుచెప్పేనా?"

"అయితే రేపే నువ్వు నన్ను తీసుకెళ్ళి ప్రవేశపెట్టించు నాన్నా."

"అట్లాగే కానివ్వు" అన్నాడాయన. సునీత ఉత్సాహంతో లోపలికి పోయింది.

ఈ సంభాషణ నంతటినీవిన్న నాకు సునీత వివాహానికి వాయిదా వేసినందులకు నాకూ సంతోషమే అయింది. కాని సునీత నర్తనశాలలో ప్రవేశించటానికి మామయ్య అనుమతించడం నాకేం సభ్యంగా తోచలేదు. సంసారికి కావల్సింది చదువు. సంస్కారం కాని నృత్యం, సంగీతం దేనికి? అది కేవలం దానిమీద ఆధారపడి జీవింపదలచుకున్న వారికే ఉపయుక్తంగా వుంటుంది. అందుచేత సునీత నాకు కాబోయే భార్య గనుక, ఈ విషయంలో నా అసమ్మతిని ఆమెకు సూటిగా చెప్పటానికి నిశ్చయించుకున్నా.

* * *

ఆమె కోరినప్రకారం మామయ్య ఆమెను నర్తనశాలలో ప్రవేశపెట్టాడు. ఆమె అనుదినం కాలేజినుండి రాగానే డ్రస్ మార్చుకుని నర్తనశాలకు వెళ్ళటం అలవర్చుకుంది. కాని నాకు ఆమె నర్తనశాలకు వెళ్ళటం సుతరామూ యిష్టంలేకపోవటం మూలాన్న ఆవేళ ఆమెకావిషయాన్ని తెలియచేసేందుకు నిశ్చయించుకున్నా.

సునీత అలవాటుప్రకారం ఆవేళ గూడా నర్తనశాలకు వెళ్ళటానికి బయలుదేరింది.

"సునీతా" అని పిల్చా.

"పిల్చేవా బావా?" అంటూ ఆమె నా వద్దకు వచ్చింది.

"అవును......సునీతా! నువ్వు నర్తనశాలకు వెళ్ళటం నాకేం సభ్యంగా తోచలేదు. ఈ విషయాన్ని చెప్పడానికే నిన్ను పిల్చింది—" అన్నా.

"ఏం బావా! అట్లంటున్నావేం?...మా క్లాసుమేట్సు — వాళ్ళూ చాలామంది వెళుతుంటే, నేను వెళ్ళటంలో తప్పేముంది?" అంది నావైపు ఆదోలా చూస్తూ.

"ఇతరుల విషయం నా కనవసరం! నేను మాట్లాడేది నీ ఒక్కర్తిగురించే. యౌవ్వనం స్త్రీకి అగ్నిపరీక్ష వంటిది. ఆ దశలోనే తెలివిగా ప్రవర్తించి, సరియైన జీవితబాటలో ప్రవేశించటానికి ప్రయత్నించాలె. కాని, దుస్సాహసాలు చేసి తప్పుడుమార్గం త్రొక్కకూడదు" అన్నా కొంచెం కఠినంగానే.

"నువ్వేదో వింతగా మాట్లాడుతున్నావ్ బావా?...నీ దృష్టిలో కళ నారాధించటం కూడా ఒక అపరాధం అయితే కావచ్చు— కాని, నా అభిప్రాయం వేరు" అని సునీత అనేప్పటికి నాలో ఒక్కమారుగా కోపోద్రేకం ఉద్భవించింది.

"నీ అభిప్రాయాలతో నాకు పనిలేదు. నిన్ను నేను వివాహం చేసుకోబోతున్నా

గనుక, నువ్వు నా అభిప్రాయానికి కట్టుబడి ప్రవర్తించాలి......లేకపోతే......” అని యింకా ఏమో అనబోతూండగా సునీత అడ్డంవచ్చి.

“నన్ను వివాహం చేసుకోనంటావ్— అంతేగా! నన్ను జడిపిస్తావా ఏం? నువ్వు వెయ్యి చెప్పు — లక్ష చెప్పు నేను నర్తన శాలకు పోవటం మానను”

“అంతేనా” అన్నా గర్జిస్తూ.

“ఆహా!” అంటూ బయటికిపోయింది.

నేను బాధగా కుర్చీలో కూలబడిపోయా. నా హృదయంలో దవాగ్నిరగుల్కొంది. నాతో అంత కటువుగా మాట్లాడింది సునీత యేనా అనిపించింది. నాతో చిన్నప్పుడు ఎంతో అనురాగంగా వుండేది. నామాట కెన్నడూ ఎదురు చెప్పియెరగదు. అటువంటి సునీత ఒక్కమారుగా ఇంతలా మారిపోవడం ఏదో వింతగా తోచింది.

“సరే! సమయంవచ్చినప్పుడు తగిన ప్రతీకారం చెయ్యకపోతానా” అనుకుని అప్పటికి వూరుకున్నా.

* * *

రోజులు దొర్లుతున్నై. నేను బి. ఏ. డిగ్రీ సంపాయించుకున్నా. సునీత ఇంటరు తప్పటం వల్ల, అక్కడితో చదువుకి స్వస్తిచెప్పింది. సునీత అభిమతం తీసుకుని, ఆ యేడు మా వివాహం చెయ్యటానికి ముహూర్తం నిర్ణయించేరు అత్తయ్య—మామయ్య. ఆరోజుకి సరిగా పది రోజులున్నది మా వివాహం. శుభలేఖలు సయితం అచ్చైనై. నాకు ఈ వివాహం యిష్టంలేదని ముందే మామయ్యతో చెప్పటానికి నిశ్చయించుకున్నా. కాని, తీరా మామయ్యముఖం చూచేప్పటికి పెదిమలు కదలేవికావు. నిజానికి తల్లిదండ్రులులేని నన్ను అందచేర్చి, పెంచి పెద్దవాణ్ణిచేసి, చదువు సంధ్యలు చెప్పించిన మామయ్యను ఎట్లా తిరస్కరించగలను? ఆ పరిస్థితిలో మామయ్యే నన్ను చేరతియ్యకపోతే, ఈపాటికి నే నేమయ్యేవాణ్ణి? తన కుమార్తెను వివాహం చేసుకుంటానన్న ఆశతో నేకదా ఇన్నాళ్ళూ నన్ను సానురాగంతో పెంచేడు. అతడు ఏ లక్ష్యంతో నన్ను చేరదీసేడో, ఆ లక్ష్యాన్ని అలక్ష్యంచేస్తే ఎంతగా బాధపడ్తాడు?... కాని, సునీత ప్రవర్తనచూస్తే రోజురోజుకూ అసహ్యకరంగా పరిణమిస్తోంది. రోజు నర్తన శాలకు వెళ్ళడం—అక్కణ్ణుంచి ఓ పదిమంది సహాధ్యాయినులను వెంటబెట్టుకువచ్చి, ఇంటి వద్ద కూడా నాట్యం ప్రాక్టీసుచెయ్యడం అప్పుడప్పుడు తన గురువు కృపాకర్‌తో పై వూళ్ళువెళ్ళి నాట్యప్రదర్శనాలివ్వటం — ఇవన్నీ చూస్తూ ఆమెను ఎట్లా వివాహం చేసుకోవాలో నాకేం అర్థంకాలా. వివాహం అయినతర్వాతమట్టుకు ఆమె నాకు ఎదురు తిరక్కుండా వుంటుందన్న మాటేమిటి?... మామయ్యకు ఎదురు తిరిగే ధైర్యం నాకు ఎట్లాగూ లేదు గనుక, వివాహం లేపనగా అక్కణ్ణించి పలాయనం చిత్తగించటానికి నిశ్చయించుకున్నా.

* * *

అప్పటికి మా వివాహం నాలుగు రోజు లున్నది. దగ్గఱ బంధువులంతా ఒక్కొక్కళ్లే వస్తున్నారు. నేను నాగదిలో కూచుని ఏవేవో ఆలోచించుకుంటున్నా. ఇంతట్లో కారు వచ్చిన శబ్దం వినిపించింది. కిటికీలోంచి తొంగిచూచా. సునీత నర్తనశాలనుండి ఇంత త్వరగా వచ్చిందేమి చెప్మా! అని—కాని నేను అనుకున్నట్లుగా సునీతరాలేదు. డ్రైవరు కారులోంచి దిగి నేరుగా నాగదిలోకి వచ్చేడు పరుగెత్తుకుంటూ.

“ఏం నారయ్యా! అంతలా వగుర్చుకుంటూ వస్తున్నావేం?” అన్నా.

నారయ్య ఒకమారు గదంతా కలయజూచి, నేను తప్ప, ఆ గదిలో మరెవ్వరూ లేరని నిర్ధారణచేసుకొన్న పిదప.

“బాబూ! మీతో కొంచెం మాటాడా లని వచ్చాను — అతిరహస్యం” అన్నాడు మెల్లగా.

“ఏమిటి నారయ్యా!” అన్నా. అతనిదగ్గ రగా వెడ్తూ.

“బాబూ! సునీతమ్మగార్ని మీరు ఎట్లా వివాహం చేసుకోవటానికి యిష్టపడ్డారో నాకేం తెలియడంలేదు. ఆమె నర్తనశాలకు వెళ్ళటం నృత్యం నేర్చుకోవటానికికాదు— కేవలం కృపాకర్ కౌగిట్లో చేరుకోవడం కోసం. సునీతను బాగా బుట్టలోవేసి, తన మీద తగనిమోజు పుట్టించుకున్నాడు బాబూ! కావలిస్తే యిప్పుడు నాతోటి రాండి సునీత నర్తనశాలలో చేసే పనేమిటో మీకే చూపిస్తాను” అన్నాడు నారయ్య.

“మరి ఈవిషయం ఇంతకుముందు ఎందుకు చెప్పలేదు నారయ్యా!”

“నిజం చెప్పాలంటే నాపేరు బైటపడి, నా ఉద్యోగం ఎక్కడ ఊడుతుందో నన్న భయంకొద్దీ యిన్నాళ్ళూ నోరుమూసుకుని ఊరుకున్నాను బాబూ! కాని, మీలాంటి బుద్ధిమంతులకు ఆమెతో వివాహం జరుగబోతోందని తలచుకున్నప్పుడల్లా గుండె పీకుతోంది బాబూ! అంచేత, అన్నిటికీ తెగించి, ఈవాళ మీముందు నిల్చుని చెప్పగల్గుతున్నా. ఎందుకైనా మంచిది తమరు ప్రత్యక్షంగా చూద్దురు గాని రాండి” అని నారయ్యచెప్పటికి “త్వరగా పద నారయ్యా!” అంటూ బయల్దేరాను. ఇర్వురం పది నిమిషాల్లో నర్తనశాల చేరుకున్నాం. మెల్లగా అడుగు లేసుకుంటూ నర్తనశాలలో ప్రవేశించాం. ఒక గదిదగ్గఱ గజ్జెల చప్పుడు ఘల్ ఘల్

*************

## కాస్టోలిన్

అన్నివిధములైన చర్మ వ్యాధులకు కాస్టోలిన్ ఒక సాటిలేని సంజీవి. దురద, కరప్పాణి, తామర, మేహవ్రణములు, మురికిపడలు, మానని కురుపులు, మొటిమలు, పిత్తపగుళ్ళు, అడుసుపుండ్లు, అన్నివిధముల గజ్జి, నారకురుపులు, కొతపడ్డ గాయములు, సొరపోవు చెడ్డకురుపులు మొదలగు వ్యాధులు మిగుల శీఘ్రముగా బాగుపరచును. డబ్బి 1-8 8 అణాలు.

ధనలక్ష్మి అండ్ కో.,

సౌకారుపేట, మద్రాసు-1

*************

మంటోంది. అక్కడ ఆగి కిటికీలోంచి దొంగ తనంగా లోపలికి చూచా. అక్కడ ఎవరో కొంతమంది యువతులు నృత్యంసాధకం చేసు కుంటున్నారు. కాని, అందులో ఎక్కడా నాకు సునీత కనుపించలా.

"సునీత ఏదీ?" అన్నట్లు నారయ్యవంక చూచా.

బొత్తిగా అమాయకులు బాబూ! సునీత ఉండే స్థలం ఇదికాదు. అయ్యగారి ప్రైవేటు రూమ్‌కి పదండి చూపెడ్తా" అంటూ నారయ్య ముందు నడుస్తుంటే అతని వెనకాలే నేనూ బయల్దేరా. మళ్ళీ కొంతదూరం వెళ్ళాక, ఒక గదివద్ద ఆగి, కిటికీలోంచి చూచి, "చూడండి బాబూ!" అన్నాడు నెమ్మదిగా నాతో. వణుకుతున్న చేతుల్తో కిటికీకి సగంవరకు కట్ట బడిన తెఱను నెమ్మదిగా కొంచెం పైకెత్తి లోపలికి చూచా. నాకళ్లను నేనే నమ్మలేక పోయా. కృపాకర్ ఆలింగనంలో నాకా బోయే ప్రేయసి అని కలలుగంటున్న సునీత! నా శరీరం అంతా ఒక్కమారుగా ముచ్చె మటలుపోసినై. కాళ్లక్రింద భూమి కంపించి నట్లయింది వెనుతిరిగిపోబోతున్నా. ఇంతట్లో వాళ్లు ఒకరిచేతులొకరు పట్టుకుని కులుకుతూ మాట్లాడుకొంటూండడంవల్ల మళ్లీ ఆగివినటం మొదలుపెట్టా.

"ఏం సునీత! ఈమధ్య నీ పెళ్ళిట?"

"ఎవరు చెప్పారు నీకు?"

"నువ్వు చెప్పకపోతే నాకు తెలియదా ఏం?...నిజమేనా"

"పోనిస్తూ మా తల్లిదండ్రులపోరు భరించ లేక పప్పుకోక తప్పిందికాదు కృపాకర్!"

"అయితే ఇహ పెళ్ళయినపిదప నన్ను పూర్తిగా మరచిపోతావన్నమాటే"

"ఊరుకుండూ నీ వేళాకోళాలూ — నువ్వూనూ"

"హాస్యంకాదు సునీతా! నిజంగా అడుగు తున్నా"

"పిచ్చి కృపాకర్! ఇన్నాళ్ళయినా నా హృదయాన్ని అర్థం చేసుకోలేకపోయావ్. మనఃపూర్వకంగా చెపుతున్నా—నీ కౌగిట్లో ఉన్నంతసేపూ ఏదో స్వర్గలోకంలో విహ రిస్తున్నట్లుంటుంది. నీకౌగిట్లోకి చేరుకోకుండా ఒక్కరోజు కూడా గడపడం దుర్భరం కృపాకర్!"

"ఒకవేళ యిక్కడకు రావటానికి మీ ఆయన అభ్యంతరం చెప్తే"

"విడాకులే!"

"హమ్మయ్య! నా జన్మ తరించింది సునీతా! నిజంగా నువ్వు నాకు తగిన ప్రేయ సివి......ఏదీ......ఒక్క......"

ఇహ నేను వినలేక గట్టిగా చెవులుమూసు కున్నా. బుర్ర దిమ్మెక్కింది. ప్రపంచమంతా గిరగిరా తిరుగుతున్నట్లు తోచింది. నారయ్య సహాయంతో నెమ్మదిగా కారులో కూచుని యింటికి చేరుకున్నా. ఇంటికి చేరుకోవటం తోనే, ఏదో నలతగా ఉండటంవల్ల మంచం మీద పడుకున్నా—నాకు తెలియకుండానే నిద్రపట్టేసింది. మళ్ళీ లేచేప్పటికి రాత్రి పది గంటలయింది. ఏమి చెయ్యటానికి పాలుపోక అట్లాగేఆలోచిస్తూ గదిలో పచార్లుచేస్తున్నా. నా మెదడులో ఒక్కమారుగా మెరుపు మెరసి నట్లయింది. త్వరగా కాగితం కలం తీసి.

"పూజ్యులైన మామయ్యకు"—

బహుశః ఈ ఉత్తరం మీకళ్ళబడేప్పటికి నేను మీకు కొన్ని వందల మైళ్ళ దూరంలో వుంటాననుకుంటా. సునీతను చిన్నప్పట్నుంచీ ఎంతో గాఢంగా ప్రేమించేను. సునీతకూడా నిండు యౌవనం వచ్చే వఱకూ నన్నూ గాఢంగా ప్రేమించింది కాని, యౌవనో ద్రేకంవల్ల దుష్టసహవాసాలవల్ల ఆమె కొన్ని చేయరానిపనులు చెయ్యటానికి పూనుకున్నది. ఏకైకపుత్రిక సునీతయందు మీకుండే వాత్స ల్యము. ఆమె చేస్తున్న అవినీతి కార్యాల్ని మరింత ఉత్సాహపర్చింది.

ఆమె రోజూ నర్తనశాలకు వెళ్ళటం కళ యందుండే అభిమానంకొద్దీకాదు — కేవలం కృపాకర్ ఆలింగనంలో తన్మయత్వం పొంద టానికి. ఇవాళ ప్రత్యక్షంగా వారి ప్రణయ కలాపాల్ని చూడటంవల్ల, ఇహ ఆమెను వివాహం చేసుకోవటానికి నాకు మనస్క రించలేదు. అంచేత పొట్ట చేత్తోపట్టుకుని దేశంమీదకు బయలుదేరా. నాకోసం వెద కించటానికి ప్రయత్నించి విఫలు రవవద్దని నా వేడుక!

ఇన్నాళ్ళూ సానురాగంతో పెంచి, పెద్ద వాణ్ణిచేసిన మీకూ, అత్తయ్యకూ యివే నా వందనములు.

మేనల్లుడు
" ప్ర సా ద్ "

అని ఉత్తరం ముగించి బల్లమీదపెట్టి పెట్టెనిండా అత్యావశ్యకమైన వస్తువులు సర్దుకుని నెమ్మదిగా పిల్లిలా అడుగులేసు కుంటూ రోడ్డుమీదకుచేరి, జట్కాలో రైలు స్టేషనుకు బయలుదేరా. అప్పుడే సిద్ధంగా వున్న బండిలో ఎక్కి ఈవూరు చేరుకున్నా. ఎట్లాగో అతికష్టంమీద ఈ ఉద్యోగం సంపా దించుకుని అప్పట్నుంచి యిక్కడే ఉండి పోయా. నాకు ఉద్యోగం దొరికిన రెండు మాసాలకు పేపరులో చూచా—

"సునీత అనే స్త్రీ తన అవినీతివల్ల కల్గిన నాలుగు మాసాల గర్భంతో, తన్ను అన్యా యముచేసిన నీచుడు వివాహం చేసుకోవ టానికి సమ్మతించకపోవడంవల్ల సముద్రుడికి ఆహుతయింది" అని.

"పాపాసఫలితం" అన్నమాటలు నా నోటమ్మట అప్రయత్నంగా రాలినై.

"ఇది మాధవ్ జరిగిన గాథ" అంటూ తనకథ ముగించేడు ప్రసాద్. యౌవనం స్త్రీల కగ్నిపరీక్షవంటిది నిజమే! అంటూ మాధవ్ బయలుదేరాడు.

---

## సాగుబడి

ఒకరు:—మీనూకాలు ఈమధ్య బాగా సాగుతోందాండీ?

ఇంకొకరు:—ఇన్నిరోజులబట్టి పనిచేస్తు న్నాను. ఈ నూకల్లో ఈసరికి యిది ఒక్క అంగుళమైనా సాగలేదే.

*　　*　　*

## ఏడుపు

(భార్య భర్తతో):—ఏమండీ ఈ చీర చూస్తే నాకు చాలా ముచ్చటగావుందండీ.

(భర్త కోపంగా):—చీర చూస్తే నీకు ముచ్చటేస్తే, చీర బిల్లుచూస్తే నాకు ఏడుపు వస్తోంది.

చేబ్రోలు సూర్యారావు